క్లుప్తంగా

వంద శాతం పింఛన్ల పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం సాయంత్రానికి వంద శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. లబ్ధిదారులందరికీ నగదు అందజేసేందుకు ప్రభుత్వం ప్రతినెలా 5వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. మండలంలో ఉన్న మొత్తం 7577 మంది లబ్ధిదారులకు మూడురోజుల్లోనే పింఛన్ నగదు అందజేశామని చెప్పారు.

పట్టుబడిన వాహనాల వేలం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఐదు ఆటోలు, రెండు మోటార్ సైకిళ్లకు వేలం నిర్వహించగా రూ.38,164 ఆదాయం వచ్చిందన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ఓర్వకల్లు: మండల పరిధిలోని మీదివేముల గ్రామంలో ఓ మహిళ అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. చాకలి వెంకటేశ్వర్లు భార్య జయమ్మ(56) మూడు సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెల నుంచి నెల 18న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిందన్నారు. జయమ్మ వెల్దుర్తి మండలం, గోవర్ధగిరి బస్సు ఎక్కినట్లు కొందరు వ్యక్తులు చెప్పారు. అయినా ఇంతవరకు జయమ్మ ఆచూకీ లభించక పోవడంతో భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరు గ్రూప్‌లకు యంత్ర సేవా పథకం

పాణ్యం: మండలంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఆరు గ్రూప్‌లకు ట్రాక్టర్లు, పనిముట్లు అందించినట్లు మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి శనివారం తెలిపారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం మెగా మేళా–2 ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు తీసుకోవడం జరిగిందన్నారు. వీటిని గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు శనివారం సంబంధిత అధికారులు తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచి పోవడంతో కేసీకి బంద్ చేసామన్నారు. డ్యామ్‌లో ప్రస్తుతం 1.110 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు (న్యూటౌన్): జెడ్పీలోని కర్నూలు ఎంపీపీ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రంగస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలోని 10వ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన 36 మంది విద్యార్థులకు, ఇంటర్ సెకెండియర్‌లో 900 మార్కులకు పైగా సాధించిన 19 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యే హంద్రీనీవా డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, ఎక్సైజ్ సీఐ మంజుల, సీపీఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ

గడివేముల: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మూడో రోజు శనివారం లబ్ధిదారులకు పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్మును అందించారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 5625 పింఛన్లు ఉండగా 5265 మందికి పింఛన్ సొమ్ము అందజేశామని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు.

'పది' పరీక్షలకు 17 మంది విద్యార్థుల గైర్హాజరు

సి.బెళగల్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 17 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల, మోడల్ స్కూళ్లలో పది సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం రెండవ రోజు హిందీ పరీక్షకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నలుగురు, మోడల్ స్కూల్లో 13 మంది గైర్హాజరు అయినట్లు ఆయా పాఠశాలల పరీక్ష నిర్వహణ అధికారులు సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు.

దేవదాయ శాఖ నూతన ఏసీగా రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం. రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం నుంచి కర్నూలుకు బదిలీ అయిన ఈయన ఏసీ కె.ఆదిశేషునాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం తడకనపల్లె మజార గ్రామం వామసముద్రంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు వామసముద్రం, తడకనపల్లె గ్రామాల నాయకులు శ్రీనివాసులు, రంగడు, సోమన్న యాదవ్, కృష్ణరెడ్డి, ధనలక్ష్మి, జయమ్మ ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో ఏమైన సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. గ్రామంలో తాగునీటి సరిగా రావడం లేదని, గృహాలు మంజూరు చేయాలని పలు సమస్యలను గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారాప్రతి గడపకూ లబ్ధిచేకూర్చారన్నారు. అవినీతి రహితంగా ప్రజా జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రికి రాబోయే ఎన్నికల్లో మరోసారి పట్టంకటాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, నారాయణరెడ్డి, సత్యంరెడ్డి, నాగేశ్వరరెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణ ఈఓఆర్డీ రవికిషోర్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి తోడ్పాటు

కల్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి తోడ్పాటునిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే



ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహం దగ్గర ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మత్స్యకారులు చేపలను గ్రేడింగ్ చేసుకోవాడనికి, నిల్వ చేసుకోవడానికి విలుగా రూ. 4.30లక్షలతో మొబైల్ వాహనాలను అందిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.మార్కపురం సర్పంచ్ గణ మద్దిలేటి, సల్కాపురం సర్పంచ్ బోయ మద్దిలేటి, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

శ్రీ కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలను ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. స్థానికులతోపాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకురుని మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

సి.బెళగల్: మండలంలో మనబడి నాడు నేడు రెండవ విడతలో భాగంగా స్కూళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తి అయ్యేలా చూడాలని గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లను కర్నూలు పంచాయితీ రాజ్ డీఈ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల పీఆర్ ఏఈ గంగరాజుతో కలిసి సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో మనబడి నాడు నేడు పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పాఠశాలలో జరుగుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని డీఈ అన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

గూడూరు రూరల్: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి స్పెషల్ ఆఫీసర్ సబీనీ ఫర్వీన్ పేర్కొన్నారు. కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం హౌసింగ్ లోన్‌ను 87 మంది లబ్ధిదారులకు మంజూరు చేయగా ఇప్పటికే 15 వరకు గృహాలు పూర్తి కావడం జరిగిందన్నారు. 20కి పైగా లెంటెల్, టాప్ లెవెల్ వరకు నిర్మాణాలు జరిగాయని, 40 వరకు బేస్‌మెంటు వరకు నిర్మా



లబ్ధిదారులో మాట్లాడుతున్న సబీహ ఫర్వీన్

ణాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవీలత, తహసీల్దార్ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ జమ్మన్న, పంచాయతీ కార్యదర్శి సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (ఎంఎల్‌హెచ్‌పీ)కు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య మాట్లాడుతూ పాము, తేలు, కుక్కకాటుకు ప్రథమ చికిత్స, రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర ప్రథమ చికిత్స, వారిని పై ఆసుపత్రులకు రెఫర్ చేయడం, గాయాలకు కుట్లు వేయడం, కట్టు కట్టడం, వివిధ రకాలైన ఇంజెక్షన్లు వేయడం, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం గురించి శిక్షణలో అభ్యసించారన్నారు. తద్వారా మీ పరిధిలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని సీహెచ్‌ఓలకు ఆదేశించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివ నాయక్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రోజారమణి, డీపీఓ విజయరాజు, నోడల్ అధికారులు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, సరళ, మంజుల పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కంబదహాల్‌లో ఘర్షణ

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో శనివారం ఇరువర్గాలు ఘర్షణ పడగా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీలో నివాసముంటున్న కురువ శ్రీనివాసులు తన అన్నలైన కురువ వెంకటేష్, కురువ గోవిందు కుటుంబ సభ్యులతో కొన్నేళ్లుగా ఆస్తి విషయంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో శనివారం కురువ వెంకటేష్, కురువ గోవిందు కుటుంబ సభ్యులతో కురువ శ్రీనివాసులు ఇంటి దగ్గరకు వచ్చి కుమారుడు జానకిరాముడు, కోడలు పార్వతితో తగాద పెట్టుకుని దాడి చేశారు. తమకు రక్త గాయాలు అయ్యాయని, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నామని బాధితుడు జానకిరాముడు తెలిపారు. సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దాడి ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పీరయ్య తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

గడివేముల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలాలు మంజూరు చేస్తామని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రమైన గడివేములలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న జగనన్న లేఔట్లను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. కొర్రపాలూరులో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ కొరకు స్థలాన్ని పరిశీలించి నివేదికలను అందజేయాలన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఆన్‌లైన్‌లో స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ఇంటి పట్టా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం కేటాయించాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. స్పందన ఆర్జీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌ఓ సామన్న తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ స్థలం స్వాధీనం

కర్నూలు : స్థానిక చిదంబరరావు వీధిలో కోట ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన స్థలంలో 20 కుటుంబాలు కొన్నేళ్లుగా నివాసముంటున్నాయి. ఖాళీ చేయాలని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ ఆయా కుటుంబాలు ఖాళీ చేయకుండా అక్కడే నివాసముండటంతో శనివారం దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారులు కలిసి పోలీసుల సాయంతో స్థలం వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డీఎస్పీ విజయశేఖర్, సీఐలు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు తమ సిబ్బందితో అక్కడ బందోబస్తు విధులు నిర్వహించగా దేవాదాయ శాఖ అధికారులు ఇళ్లను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. దీంతో వారు అధికారులకు వ్యతిరేకంగా కొద్దిసేపు ఆందోళనకు దిగారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు స్థలం ఖాళీ చేసి దేవాదాయ శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులు సూచించినప్పటికీ పేదలు ఆందోళనకు దిగడంతో సీఐ తిమ్మారెడ్డి కలగజేసుకుని ప్రత్యామ్నాయం కోసం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌ను కలిసేందుకు అవకాశం కల్పిస్తానని హామీ ఇవ్వడంతో పేదలు ఆందోళన విరమించి స్థలాన్ని ఖాళీ చేశారు.

వెండి కిరీటం బహూకరణ

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ ఆలయ ఆవరణలోని షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి కిరీటం బహూకరించారు. శనివారం ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణకు ట్రస్ట్ సభ్యులు, దాతలు సీఏ రమేష్ వర్మ, పద్మలత, సీఏ రూపేష్, హారిక దంపతులు వెండి కిరీటాన్ని అందజేశారు. స్వామివారికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించి వెండికిరీటాన్ని అలంకరించారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నగేష్, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ దుకాణాల్లో తనిఖీలు



బస్టాండ్‌లోని దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూసిటీ): ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తినుబండారాలు, వాటర్, కూల్‌డ్రింక్‌లు, వాటర్ బాటిళ్లు ఎక్కువ ధరకు విక్రయిస్తూ ప్రయాణికులను దోచుకుంటున్న వైనంపై 'ఇక్కడ అన్నీ అధిక ధరలే' అనే శీర్షికతో 'సాక్షి' శనివారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన తూనికలు, కొలత శాఖ డిప్యూటీ కంట్రోలర్ చల్లా దయాకర్ రెడ్డి తనిఖీలు చేయించారు. బస్టాండ్‌లోని షాపులే కాక చుట్టూ పక్కల ఉన్న దుకాణాలను అధికారులు తనిఖీలు చేసి ధరలపై ఆరాతీశారు. 8 షాపుల్లో కూల్‌డ్రింక్‌ను ఎమ్మార్పీపై రూ.2 నుంచి రూ.10 వరకు ఎక్కువ వసూలు చేస్తుండటాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. సదరు షాపు యాజమానులకు రూ.52 వేలు జరిమానా సైతం విధించినట్లు ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాములు తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం.పరమేశ్వరకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పేదరిక నిర్మూలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కర్నూలు మండలం మిలిటరీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు నందనపల్లె గ్రామ సర్పంచ్ మాధురి, ఎంపీటీసీ జ్యోతి, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, అనిల్ బాషా, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందరినీ పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు వర్తించిన పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కాలనీలో శివారులోని సర్వే నంబర్ 204/1ఏలోని 90 సెంట్ల శ్మశాన వాటికను కొందరు ఆక్రమించుకున్నారని గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే శ్మశాన వాటికను అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే చేసి శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేయాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడును ఆదేశించారు. సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో ఏ నాయకుడైనా ఇచ్చిన మాట



మిలిటరీ కాలనీలో లబ్ధిదారురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

నిలబెట్టుకోవాలని, అదే ప్రజల్లో విశ్వసనీయత పెంచుతుందన్నారు. జగనన్న తన ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98శాతానికి పైగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. నవరత్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, ఎంపీటీసీలు జ్యోతి, రామ్‌నాథ్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఎం మల్లికార్జునస్వామి, ఏపీఓ మధుబాబు, ఉప సర్పంచ్ మల్లశివుడు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, సురేష్, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టిన చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో 600కు పైగా హామీలిచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఎద్దేవా చేశారు. ప్రజలు గుణపాఠం చెప్పినా మళ్లీ మాయమాటలు చెబుతున్నారని, ఆల్‌ఫ్రీ పథకాలతో మభ్యపెట్టేందుకు చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కాపీ పథకాలు ప్రకటించినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ నాయకులు దోచుకున్నారని, పేదలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. సీఎం జగనన్న పార్టీలకు అతీతంగా అర్హులదరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన రామాంజినేయులు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కొలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి శనివానం తెలిపారు. బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లెకు చెందిన రామాంజినేయులు(47) తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన పెద్దక్కతో వివాహమైంది. మృతుడు టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అయితే తమ్మరాజుపల్లె వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న నంద్యాల డిపోకు చెందిన ఏపీ21జెడ్0639నంబర్ ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో రామాంజినేయులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించగా కొలుకోలేక మృతి చెందారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి ఉర్దూ టీచర్లకు శిక్షణ

కర్నూలు సిటీ: జిల్లాలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యాలకు చెందిన స్కూళ్లలో 2018 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉర్దూ మీడియం టీచర్లకు ఈ నెల 5 నుంచి ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు ప్రతి ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బి.తాండ్రపాడులోని డైట్ కాలేజీలో శిక్షణ జరుగుతుందన్నారు.

ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలం పరిశీలించారు. శనివారం కమిషన్ సభ్యులు నగర శివారులోని దిన్నెదేవరపాడు రోడ్డులో (ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద) ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. 220 కేవీ సామర్థ్యం ఉన్న ఉప కేంద్రానికి సంబంధించిన స్థలాలను తనిఖీ చేశారు. ఈ సబ్ స్టేషన్‌లోని రెండు ఎకరాల స్థలంలో ఈఆర్‌సీ పక్కా భవనాన్ని నిర్మించేందుకు గత నెల 26వ తేదీన కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈఆర్‌సీ సెక్రటరీ కె. రాజబాపయ్య, సభ్యులు ఠాకూర్ రామసింగ్ కర్నూలుకు వచ్చి సివిల్, ఎలక్ట్రికల్ అధికారులు సమావేశమయ్యారు. స్థలం, స్వభావం



ఈఆర్‌సీ కార్యాలయ నిర్మాణం కోసం ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్‌లో చర్చిస్తున్న సభ్యులు

, భవన నిర్మాణం కోసం ప్రణాళిక లు పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను ఎస్‌ఈలు ఉమాపతి, కృష్ణకుమార్, సివిల్ అధికారులు వివరించారు. సభ్యుల వెంట ఈఈ రజనీకాంత్ రెడ్డి ఉన్నారు.

అర్బన్‌హెల్త్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ శనివారం షరీన్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణిలు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్లు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను ఆయన పరిశీలించారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్లు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. గర్భవతులకు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని, ప్రమాదకర చిహ్నాలు ఉన్న వారిని మూడు రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్, ఎంపీహెచ్ఎస్ శివకుమార్, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సైక్లింగ్ శరీరానికి, పర్యావరణానికి మేలు

కర్నూలు(హాస్పిటల్): ప్రతిరోజూ సైకిల్ తొక్కడం ఇటు శరీరానికి ఆరోగ్యం పెంపొందడమే గాక అటు పర్యావరణానికి మేలు జరుగుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా శరీరానికి రోగనిరోధకశక్తి పెరుగుతుందని, అధిక రక్తపోటు, షుగర్, గుండె జబ్బులు వంటి సమస్యలు తగ్గిపోతాయన్నారు. ఊపరితిత్తులు చాలా బలంగా ఉంటాయని, అధికంగా ఉన్న కొవ్వు కరుగుతుందన్నారు. సాధారణం కంటే ఎక్కువ శ్వాస తీసుకుంటామని తెలిపారు. వీలైనంత వరకు ప్రతిరోజూ 30 నిమిషాల పాటు సైకిల్ తొక్కడం వల్ల అనారోగ్యం పడే అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నారు. చిన్నవయస్సు నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సైకిల్ తొక్కడం అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీపీఎంయూ డాక్టర్ ఉమ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, డాక్టర్ హకీం రషీద్, డీపీవో విజయరాజు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య

సైక్లింగ్‌తో ఆరోగ్యం

కర్నూలు (న్యూసిటీ): ప్రతి రోజూ సైక్లింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. శశనివారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరం ఏప్రిల్‌లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 3వ తేదీని ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావచ్చని చెప్పారు. ఉద్యోగస్తులందరూ వారంలో ఒక్కరోజు సైకిల్ మీద కార్యాలయాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ షఫీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు